క్లుప్తంగా

చిలకలపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం



గ్రామంలోని కూరాకుల వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి పంచాయతీలో సుమారు రూ.6లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. పంచాయతీకి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు పనులు నిర్వహించినట్టు సర్పంచ్ సుందర రావు తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా గ్రామంలో రోడ్డు సదుపాయం లేకపోవడంతో వీధివాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడంతో సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

7న 16 వాహనాలకు వేలం

- సీఐ కృష్ణారావు



పార్వతీపురం టౌన్: గతంలో సారా రవాణా చేస్తూ పట్టుబడిన 16 వాహనాలకు ఈనెల 7వ తేదీన వేలం వేయనున్నట్లు ఎపట్టణ సీఐ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నామని ఉత్సాహ వంతులు ఆ రోజు ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వేలంలో పాల్గొని, నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని కోరారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



యూజర్ చార్జీలు వసూలు చేస్తున్న మున్సిపల్ ఆర్ఐ

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా యూజర్ చార్జీలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వినయ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో వన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్‌చార్జీలు చెల్లించడం ద్వారా పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఘనసన్మానం



దొరబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: హర్యానాలోని కురుక్షేత్రంలో జరిగిన ఆలిండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో హైజంప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రాయగడ జమ్ము గ్రామస్తుడు పువ్వల దొరబాబును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పత్తిక అమల, ఎంపీటీసీ మండంగి శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తమ గ్రామానికి చెందిన వారు రాణిస్తుండడం చాలా సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని టోర్నీల్లో పాల్గొని, సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి వాసుదేవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పత్తిక బీసు, మండంగి బీమారావు, తాడంగి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేక్ అక్రిడేషన్‌పై ఓరియంటేషన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ రాజు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) అక్రిడేషన్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేక్ గుర్తింపునకు సంబంధించి, ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు పలు అంశాలు వివరించారు. అంతకుముందు వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకరరావు నేతృత్వంలో వికరణ భౌతికశాస్త్రం దాని అనువర్తనాలు, మానవాళికి భౌతికశాస్త్రం ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, అధ్యాపకులు ఎం.ఎస్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి పెద్దపీట

- రూ.9.12కోట్లతో మున్సిపాలిటీ బడ్జెట్ రూపకల్పన
- అన్ని వర్గాలకు సమానాభివృద్ధి



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, అన్ని వర్గాల సమానాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు శుక్రవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో ప్రకటించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దేందుకు చర్యలకు మున్సిపాలిటీ పాలకవర్గం ఉపక్రమించింది. గతంలో ఉన్న బడ్జెట్‌కు భిన్నంగా ఈ ఏడాది మిగులు బడ్జెట్‌ను రూపొందించింది.

2023-24 సంవత్సరానికి రూ.9.12కోట్లతో అభివృద్ధికి ఊతమిచ్చేలా కేటాయింపులు చేపట్టారు. గతంలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా జిల్లా కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా రాబడులు, వ్యయాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ బడ్జెట్‌ను రూపొందించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7.90 కోట్లకు ప్రతిపాదించగా రూ.4.61 కోట్లను రివైజ్డ్ బడ్జెట్ కింద ఖర్చు చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.9.12 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. అందులో రూ.2.92 కోట్ల మిగులు పొందడానికి ప్రణాళికలు రూపొందించారు. 2023-24లో రెవెన్యూ ఆదాయం రూ.4.06 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అలాగే ఖర్చులను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ రూ.3.70 కోట్లకు తగ్గించి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు.

జనరల్ ఫండ్స్ లొకేషన్

మున్సిపల్ జనరల్ ఫండ్స్‌ను ఈ ఏడాది 41.55 శాతం పెంచి పట్టణాభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ రూపొందించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వాటర్ సప్లై, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, రిక్రియేషన్ ఫెసిలిటీస్ కోసం నిధులు వెచ్చిస్తారు. అలాగే పార్కులు, కమ్యూనిటీ హాల్స్, బిల్డింగుల నిర్వహణకు ఈ ఆర్థిక సంవత్సరం పెంచనున్నారు. ఎప్పటిలాగే ప్రజాప్రయోజనాల నిమిత్తం, స్లమ్స్ కోసం 40 శాతం, షెడ్యూల్డ్ క్యాస్టుల కోసం 15 శాతం, ఎస్టీల కోసం 7.50 శాతం, స్త్రీ శిశు సంరక్షణ కోసం 5 శాతం, డిసేబుల్డ్ కోసం 3 శాతం ముదింపు చేయనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెరిగిన రాబడులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం మరింత చేయూత అందనుంది. స్థానిక సంస్థలు స్వయం ప్రతిపత్తి సాధించేందుకు 2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల రాక రూ.7.90 కోట్ల నుంచి రూ.9.12 కోట్లకు పెరిగింది. వాటి ద్వారా మున్సిపాలిటీ సుందరీకరణ మరింత సాధ్యమవుతుంది.

పట్టణాభివృద్ధికి కృషి



పార్వతీపురం పట్టణాభివృద్ధికి పూర్తి చర్యలు చేపట్టాం. అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించాం. వాటర్ సప్లై, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, రిక్రియేషన్ ఫెసిలిటీస్ కోసం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చిస్తాం. అలాగే పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాం.

– రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

గృహ సారథులే వారధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం కేటాయించిన 50 కుటుంబాలకు అండగా నిలవాలని, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు గృహసారథులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ పరిధిలోని 21వార్డుల సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన గృహ సారథుల పరిచయ వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే అంతిమ లక్ష్యంగా చేసుకుని రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడమే ప్రధాన కర్తవ్యంగా తీసుకుని ప్రచారం చేయాల్సిన ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. గృహ సారథుల బాధ్యతలను, విధి విధానాలను, పార్టీ అభివృద్ధిలో వారి భాగస్వామ్యంపై వివరించడంతో పాటు వచ్చే ఈ నెల 18వ తేదీ నుంచి గృహ సారథులు ఇంటింటికి వెళ్లి నిర్వహించబోయే 'జగన్ అన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం నిర్వహణపై అనుసరించాల్సిన విధి విధానాలపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకరరావు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోర్ల మరమ్మతులు త్వరగా చేయండి



క్రాష్ ప్రోగ్రాం వ్యాన్‌ను ప్రారంభించిన ఎంపీపీ నాగమణి

బలిజిపేట: గ్రామాల్లో ఎక్కడా బోర్ల మరమ్మతులు లేకుండా బాగు చేయాలని ఎంపీపీ నాగమణి కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా బోర్ల మరమ్మతులు చేయాలని, అందుకోసం అవసరమైన మెటీరియల్‌ను సిద్ధం చేసుకుని గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం పనులు చేయాలని సూచించారు. ముందుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లకు సమాచారాన్ని అందించి నిర్ధారించిన తేదీల ప్రకారం గ్రామాలకు వెళ్లి మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వెంగాపురం ఎంపీటీసీ మురళి, కె.వెంకటరమణ, టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటినిర్మాణం వేగవంతం

- ఐటీడీఏ పీఓ విష్ణుశ్రీచరణ్



బుడ్డిపేటలో ఇళ్ల నిర్మాణం పరిశీలిస్తున్న గృహనిర్మాణ అధికారులు కృష్ణ, సంతోష్‌కుమార్



ఇంటినిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుశ్రీచరణ్

పాచిపెంట: మండలంలోని జగనన్నకాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుశ్రీచరణ్ సూచించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇంటి నిర్మాణాల గురించి అడిగితెలుసుకున్నారు. నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయంటూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఉగాదినాటికి ఇచ్చిన టార్గెట్ ఏదైతే ఉందో అది పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ వెంకటేష్‌లు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

మండల కేంద్రంలోని ఏపీటీడబ్ల్యూహెచ్ బాలికల పాఠశాలను ఐటీడీఏ పీఓ విష్ణుశ్రీచరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి 10వ తరగతి పిల్లలకు రోజువారీ నిర్వహించే పరీక్షల గురించి సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. విద్యార్థులు రాసిన పరీక్షపేపర్లను స్వయంగా పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్ లబ్ధిదారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేటలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలోని అప్పయ్యపేట, బుడ్డిపేట, సీతానగరం, పెదభోగిలి గ్రామాల్లో ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు అధిక స్థాయిలో జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయించండి

బలిజిపేట: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయించాలని పార్వతీపురం మన్యం జిల్లా హౌసింగ్ డీఈ ప్రసాద్‌బాబు సూచించారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాదికి సామూహిక నూతన గృహప్రవేశం ఉన్నందున గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయించాలని సూచించారు. ఇంటిపన్నులు, నాన్ టాక్స్‌కు సంబంధించి కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ భానుమూర్తి సూచించారు. మార్చి నెలాఖరుకు ఇంటి పన్నులు వసూలు చేయాలని తెలిపారు. నాన్ టాక్స్ బకాయిలు ఎక్కువగా ఉన్నందున వాటిపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలి

- దళిత జేఏసీ నాయకుల డిమాండ్

పాలకొండ రూరల్: దళిత యువకుడు జమ్మాన సుదర్శన్‌ను హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలో ఉన్న నీలంపేటకు చెందిన సుదర్శన్‌ను అదే గ్రామానికి చెందిన ఆధిపత్య కులస్తులు కొంత మంది హత్య చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తీసుకురాగా, ఈ విషయం తెలుసుకుని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను, ఆలిండియా దళిత రైట్స్ ఫోరం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షుడు కంఠ వేణు, బత్తిన మోహనరావు తదితరులు ఆస్పత్రికి చేరుకుని, సుదర్శన్ మృతికి నివాళులర్పిస్తూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, శ్రీకాకుళం దిశ డీఎస్పీ వాసుదేవరెడ్డిలతో మాట్లాడి, మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న దళిత జేఏసీ నాయకులు

సహిత విద్యాకేంద్రంలో మెరుగైన సేవలందించాలి

- డీఈఓ ఎస్డీవీ రమణ



మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ ఎస్డీవీ రమణ

సీతానగరం: సహిత విద్యా వనరుల కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు మెరుగైన సేవలందించాలని డీఈఓ డాక్టర్ ఎస్డీవీ వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఉన్న సహిత విద్యా వనరుల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సహిత విద్య ఉపాధ్యాయులు, పిల్లల హాజరు, పిల్లలకు బోధన ఏవిధంగా నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిజియోథెరపీ కేంద్రం నిర్వాహణ చికిత్సకు ఎంతమంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారు? ఫలితాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహించే ఫిజియోథెరపీ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రుల హాజరు తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సహిత విద్యకు ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. జిల్లాలోని సహిత విద్యా వనరుల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది అంకిత భావంతో విద్యార్థులకు సేవలందించడానికి కృషి చేయాలని డీఈఓ వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సహిత వనరుల కేంద్రం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



పనసభద్రలో మురుగునీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

మక్కువ: మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ సుందరి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పనసభద్ర పంచాయతీ సచివాలయం పరిధిలోని దుగ్గేరు గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి గ్రామంలోని మురుగుకాలువలు, తాగునీటి వనరులను పరిశీలించారు. ఇంటిచుట్టూ మురుగునీరు నిల్వ ఉంటే, దోమలు విజృంభించే అవకాశముందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చెత్తను ఇంటి పరిసరాలు చుట్టూ వేయకుండా, గ్రీన్ అంబాసిడర్లకు తెలియజేస్తే, వారు చెత్తను చెత్తసంపద తయారీకేంద్రాలకు తరలిస్తారన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యంతోనే దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ టి.హేమాక్షి

సీతానగం: ఆయుర్వేద వైద్యం, యోగాతోనే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు శుక్రవారం బుడ్డిపేటలో సీతానగరం ఆర్‌సీహెచ్ వైద్య సిబ్బంది సహకారంతో ఆయుష్ ఉచితవైద్య శిబిరాన్ని ఆమె నిర్వహించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా దీర్ఘకాలంనుంచి వాత, చర్మ, ఆస్తమా, జీర్ణకోశ, కీళ్ల నొప్పుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎటువంటి వ్యాధి అయినా ఆయుర్వేద మందులు నిర్దేశించిన సమయంలో రోగి వాడితే నయమవుతుందని చెప్పారు. బుడ్డిపేటలో మల,మూత్ర సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని పరీక్షించి అవసరమైన ఆయుర్వేద మందులు అందజేశారు. అదేవిధంగా వేసవికాలం దృష్ట్యా వేసవి తాపానికి గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయుర్వేద వైద్యం ఆవశ్యకతను వివరించి ప్రజలకు పలువ్యాధుల నివారణలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. యోగా టీచర్ ద్వారా వేసే యోగాసనాల వల్ల ఉపయోగాలను వివరించారు. ఇక్కడ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ ఏఎన్ఎం వై.పద్మ, యోగా ట్రైనర్ ఎం.రూపవతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ

వీరఘట్టం: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కిమ్మి, నడుకూరు గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఓ రవిబాబు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని, జనావాసాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా అడవుల్లోకి తరలించాలన్నారు. ముఖ్యంగా గజరాజులను వెళ్లగొట్టేందుకు వాటికి సమీపంలోని చెరకు తోటలు, గడ్డివాములకు నిప్పంటించవద్దన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేయండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని జెడ్పీటీసీ రవికుమార్ కోరారు. ఈ మేరకు బలిజిపేటలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికల బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను అందరం కలిసి గెలిపించుకోవాలని పట్టభద్ర ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బలిజిపేట సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీటీసీ మురళి, పి.నారాయణరావు, టి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించాలి

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురం పురపాలక సంఘంలోని 30, 1, 2వ వార్డుల్లో ప్రజా ప్రతినిధులతో కలిసి పట్టభద్రులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని వారికి ప్రచార కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్ నిర్ణయించిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆయన పేరుకు ఎదురుగా 1నంబర్ వేసి తప్పక గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రచారం



పార్వతీపురం టౌన్: ఎంఆర్ నగరంలో ప్రచారం చేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్



సాలూరు: ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఎంఆర్‌నగరం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉరిటి అప్పలనాయుడు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు..

సాలూరులో..

సాలూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్‌వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు ,నాయకులు జర్జాపు సూరిబాబు, గిరిరఘు, రాపాక మాధవరావు, సింగారపు ఈశ్వరరావు, బాలకృష్ణ, గొర్లె వెంకటరమణ, తాడ్డి రమణ తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రామాకాలనీ తదితర ప్రాంతాల్లో పట్టభద్రులతో మాట్లాడారు.